AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAYNEWS.COM
20-5-2026 (Wednesday) MAIN EDITION

## హైదరాబాద్ మెట్రో సెకండ్ ఫేజ్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్



**అక్షరటుడే, ఢిల్లీ:** హైదరాబాద్ ప్రజా రవాణా వ్యవస్థను మరింత మెరుగుపర్చడంలో మరో కీలక అడుగు పడింది. మెట్రో సెకండ్ ఫేజ్‌కు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రెండో దశకు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో నేడు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సమావేశం అయ్యారు. భేటీలో హైదరాబాద్ మెట్రో రెండో దశ ప్రాజెక్టుపై చర్చ జరిగిందని కిషన్ రెడ్డి తెలిపారు. మెట్రో సెకండ్ ఫేజ్‌కు కేంద్ర మంత్రి సూత్ర ప్రాయంగా అంగీకరించారని పేర్కొన్నారు. డీపీఆర్ అందిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని మనోహర్ లాల్ ఖట్టర్ తెలిపారని చెప్పారు.

## ఆల్‌టైం కనిష్టానికి రూపాయి విలువ..



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న భౌగోళిక, రాజకీయ సమీకరణాల వల్ల రూపాయి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. బుధవారం ఉదయం ట్రేడింగ్ ప్రారంభంలోనే ఆల్‌టైం కనిష్టానికి పడిపోయింది. డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ 20 పైసలు క్షీణించి.. 96.90 చేరింది. ఇరాన్ అమెరికా మధ్య సైనిక ఉద్రిక్తతల కార ణంగా గ్లోబల్ మార్కెట్‌లో డాలర్ ఇండెక్స్ బలోపేతం అయ్యింది. అదే సమయంలో అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ రేటు భారీగా పెరిగా యి. దీంతో ఈ ప్రభావం రూపాయిపై పడి చరిత్రలో కనిష్టస్థాయికి పడిపోయింది.

## 'సూర్యాస్త్ర' రాకెట్ ప్రయోగం సక్సెస్



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** స్వదేశీ రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేస్తూ భారతదేశానికి చెందిన ప్రముఖ ప్రైవేట్ రక్షణ సంస్థ 'నిబే లిమిటెడ్' సరికొత్త చరిత్ర సృష్టించింది. శత్రువుల గుండెల్లో వణుకు పుట్టించే అత్యంత అధునాతన సుదూర రాకెట్ వ్యవస్థ 'సూర్యాస్త్ర' ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేసింది.

## అందుకే నా కుమారుడిని అప్పగించా: బండి



**అక్షరటుడే, హైదరాబాద్:** విచారణకు పూర్తిస్థాయిలో సహకరించాలనే ఉద్దేశంతోనే తన కుమారుడిని స్వయంగా పోలీసులకు అప్పగించినట్లు కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలిపారు. కన్నకొడుకును ఏ తండ్రైనా స్వయంగా పోలీసులకు అప్పగించిన సందర్భాలు గతంలో ఎప్పుడైనా ఉన్నాయా అని ప్రశ్నించారు.

## మోదీ, షా దేశద్రోహులు: రాహుల్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పీఎం మోదీ దేశ ఆర్థిక వ్యవస్థను అంబానీ, అదానీ, యూఎస్‌లకు అమ్మేశారని రాహుల్ గాంధీ విమర్శించారు. 'ఆర్థిక తుఫాను రాబోతోంది. దాని నుంచి మోదీ, ఆయన ప్రభుత్వం మిమ్మల్ని కాపాడలేదు.' అని యూపీలోని రాయబరేలిలో జరిగిన సభలో వ్యాఖ్యానించారు.

# కులగణనకు లైన్ క్లియర్

**దేశంలో కులగణన నిర్వహణకు లైన్ క్లియర్ అయ్యింది. దేశంలో కులగణన నిర్వహణకు సంబంధించి సుప్రీంకోర్టు బుధవారం ఒక చారిత్రాత్మక నిర్ణయాన్ని ప్రకటించింది. జనగణనతో పాటే కులాల లెక్కింపును కూడా చేపట్టేందుకు సర్వోన్నత న్యాయస్థానం పచ్చజెండా ఊపింది. కులగణన ప్రక్రియను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లన్నింటినీ విచారించిన కోర్టు, వాటిని పూర్తిగా కొట్టివేస్తూ ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించింది.**

**– అక్షరటుడే, ఢిల్లీ**



▪ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సుప్రీంకోర్టు ▪ ప్రక్రియను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ల కొట్టివేత

కులగణనపై దేశ అత్యున్నత న్యాయస్థానం కీలక తీర్పు ఇచ్చింది. కుల గణను వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషను కొట్టివేసింది. వెనుకబడిన కులాల జనాభా తెలిస్తేనే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొంది. ఇది విధానపరమైన నిర్ణయమని.. ఇందులో జోక్యం ఉండబోదని స్పష్టం చేసింది. ఈ చారిత్రక తీర్పుతో దేశవ్యాప్తంగా కులాల వారీగా జనాభాను లెక్కించేందుకు ఉన్న అన్ని రకాల చట్ట పరమైన అడ్డంకులు తొలగిపోయాయి.

### ధర్మాసనం కీలక వ్యాఖ్యలు

ఈ కేసు విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం అత్యంత కీలకమైన వ్యాఖ్యలు చేసింది.

కులగణన అనేది పూర్తిగా ప్రభుత్వ విధానాలకు సంబంధించిన అంశమని, ఇలాంటి పరిపాలనాపరమైన నిర్ణయాల్లో న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవని ధర్మాసనం స్పష్టం చేసింది. సమాజంలో వెనుకబడిన వర్గాల కచ్చితమైన జనాభా వివరాలు, వారి సామాజిక, ఆర్థిక స్థితిగతులు ప్రభుత్వాల దగ్గర ఉన్నప్పుడే.. నిజమైన అభివృద్ధి, సమన్యాయం సాధ్యమవుతుందని న్యాయస్థానం అభిప్రాయపడింది. కులగణనకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను కొట్టేవేసింది.

### సంక్షేమ పథకాల అసలైన లబ్ధి కోసమే..

సమాజంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో సక్రమంగా అందాలన్నా, వాటిని మరింత సమర్థవంతంగా అమలు చేయాలన్నా కులాల వారీ గణాంకాలు ఎంతగానో ఉపయోగపడతాయని న్యాయమూర్తి పేర్కొన్నారు. ప్రస్తుత సామాజిక పరిస్థితుల్లో ఈ ప్రక్రియ ఎంతో అవసరమని కోర్టు పేర్కొంది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తాజా తీర్పుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా కులగణన ప్రక్రియను వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు మార్గం సుగమమైంది.

## కర్నూలు జిల్లాలో ప్రమాదకర 'బ్రూసెల్లోసిస్' కలకలం..



**అక్షరటుడే, ఏపీ:** కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం బనవాసిలోని ప్రభుత్వ సెమన్ బ్యాంక్‌లో ప్రమాదకరమైన 'బ్రూసెల్లోసిస్' వ్యాధి బయటపడడం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. సాధారణంగా ఈ జబ్బు పశువుల నుంచి మనుషులకు వేగంగా వ్యాపించే గుణం కలిగి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే అక్కడ పనిచేసే ఇద్దరు కూలీలకు కూడా ఈ వ్యాధి సోకినట్లు నిర్ధారణ కావడంతో స్థానిక ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.



## బీరు బాటిల్‌లో కండోమ్ ప్యాకెట్

**అక్షరటుడే, సిద్దిపేట:** సిద్దిపేట జిల్లాలో షాకింగ్ ఘటన వెలుగులోకి వచ్చింది. సాధారణంగా సీల్ చేసిన బీరు బాటిల్‌లో కండోమ్ ప్యాకెట్ కనిపించడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట భూంపల్లిలోని వైన్ షాపు నుంచి ఓ వ్యక్తి కింగ్‌ఫిషర్ లైట్ బీర్లను కొనుగోలు చేశాడు. ఇంటికి వెళ్లిన తర్వాత కొన్ని బాటిళ్లు వినియోగించిన అతడు, ఇంకా సీల్ తీయని మరో బాటిల్‌ను చూడగా అందులో కండోమ్ ప్యాకెట్ కనిపించింది. దీంతో ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. వారు ఈ విషయమై దర్యాప్తు చేస్తున్నారు.

## బీసీలు ఎదగడం మోదీకి ఇష్టం లేదు: వీహెచ్



**అక్షరటుడే, హైదరాబాద్:** దేశంలో కులగణనకు మద్దతుగా సుప్రీంకోర్టు ఇచ్చిన కీలక తీర్పును తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, మాజీ ఎంపీ వి.హనుమంతరావు (వీహెచ్) స్వాగతించారు. ఈ తీర్పు ఎంతో చారిత్రాత్మకమైనదని కొనియాడిన ఆయన.. దేశంలోని 60 కోట్ల మంది ప్రజలకు న్యాయం చేసిన జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఆలోచనల మేరకే తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కులగణన ప్రక్రియను చేపట్టిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. వెనుకబడిన వర్గాలు (బీసీలు) ఆర్థికంగా, సామాజికంగా ఎదగడం ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి ఇష్టం లేదని వీహెచ్ విమర్శించారు.

## ఇటలీ ప్రధాని మెలోనికి మోదీ స్పెషల్ గిఫ్ట్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ప్రధాని నరేంద్ర మోదీ ఇటలీలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆ దేశ ప్రధాని జార్జియా మెలోనీ మోదీ స్పెషల్ గిఫ్ట్ ఇచ్చారు. మెలోడీ చాక్లెట్లను గిఫ్ట్‌గా ఇవ్వడంతో ఆమె సంతోషం వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోను ఆమె సోషల్ మీడియాలో షేర్ చేశారు. 'థాంక్యు ఫర్ ది గిఫ్ట్' అని క్యాప్షన్ ఇచ్చారు. కాగా.. వీరిద్దరిని 'మెలోడీ' టీంగా పిలుస్తుంటారు. ఈ నేపథ్యంలో మోదీ 'మెలోడీ' చాకెట్లను గిఫ్ట్‌గా ఇవ్వడం విశేషం.

## జలమండలి జీఎం లక్ష్మీకుమార్‌కు 14 రోజుల రిమాండ్



**అక్షరటుడే, హైదరాబాద్:** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో జలమండలి మేనేజర్ లక్ష్మి కుమార్ ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. ఆయనను ఏసీబీ స్పెషల్ కోర్టు జడ్జి ఎదుట హాజరుపర్చగా.. న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో చంచల్‌గూడ జైలుకు పంపించారు. జీఎం లక్ష్మి కుమార్ ఇంట్లో ఏసీబీ అధికారులు మంగళవారం సోదాలు నిర్వహించి భారీగా అక్రమ ఆస్తులు గుర్తించిన విషయం తెలిసిందే. ఆయన ఇంట్లో రూ. కోటికిపైగా నోట్ల కట్టలు, కిలోల కొద్దీ బంగారం బయటపడ్డాయి. దీంతో ఆయన ఇల్లుతో పాటు కార్యాలయం, స్నేహితులు, బంధువుల ఇళ్లలో ఏసీబీ అధికారులు సోదాలు చేయగా.. కండ్లు చెదిరే ఆస్తులు వెలుగుచూసిన విషయం తెలిసిందే.

## క్యాన్సర్ మందుల అక్రమ రవాణాపై ఢిల్లీ హైకోర్టు ఫైర్..




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** భారత్‌లో క్యాన్సర్ రోగుల కోసం ఉద్దేశించిన అత్యవసర ప్రాణ రక్షణ ఔషధాలు అక్రమంగా విదేశాలకు తరలిపోతున్నాయనే వ్యవహారంపై ఢిల్లీ హైకోర్టు తీవ్రంగా స్పందించింది. కేవలం భారతదేశంలో మాత్రమే అమ్మాలనే నిబంధన ఉన్న అత్యంత ఖరీదైన క్యాన్సర్ మందులను, కొందరు వ్యాపారులు అక్రమంగా విదేశాలకు తరలిస్తున్నారంటూ కోర్టులో ఒక కేసు నమోదైంది."స్థానిక మార్కెట్ నుంచి ఈ మందులను గుట్టుచప్పుడు కాకుండా సేకరించి, ఇతర సరుకులతో కలిపి అక్రమంగా విదేశాలకు ఎగుమతి చేస్తున్నారని పిటిషనర్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పిటిషన్‌ను విచారించిన జస్టిస్ డి.కె. ఉపాధ్యాయ, జస్టిస్ తేజస్ కారియాలతో కూడిన డివిజన్ బెంచ్ ఈ మందుల అక్రమ రవాణా వ్యవహారాన్ని చాలా తీవ్రమైన అంశంగా పరిగణించింది. అక్రమ దందాపై వివరణ ఇవ్వాలంటూ కేంద్ర ప్రభుత్వంతో పాటు డ్రగ్స్ కంట్రోల్ సంస్థ, విదేశీ వాణిజ్య డైరెక్టరేట్, కస్టమ్స్ విభాగానికి చెందిన సీబీఐసీ, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్‌లకు ఢిల్లీ హైకోర్టు అత్యవసర నోటీసులు జారీ చేసింది.

## ఫిలిం ఛాంబర్ అధ్యక్ష పదవికి సునీల్ నారంగ్ రాజీనామా



**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణ స్టేట్ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ పదవికి ప్రముఖ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్, ఏషియన్ మల్టీప్లెక్స్‌ల అధినేత సునీల్ నారంగ్ రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల వల్లే తాను ఈ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు పేర్కొంటూ ఆయన ఛాంబర్‌కు అధికారికంగా ఒక ఈమెయిల్ పంపించారు. సునీల్ నారంగ్ తీసుకున్న ఈ అకస్మాత్తు నిర్ణయంతో టాలీవుడ్‌లో చర్చ మొదలైంది. కాగా, ఈ ఖాళీ అయిన అధ్యక్ష స్థానాన్ని భర్తీ చేయడానికి శుక్రవారం కొత్త అధ్యక్షుడి ఎంపిక కోసం ఎన్నిక జరగనున్నట్లు ఫిల్మ్ నగర్ వర్గాల సమాచారం. పైకి వ్యక్తిగత కారణాలని చెబుతున్నప్పటికీ, ఇటీవల టాలీవుడ్‌లో థియేటర్ల లీజు వ్యవహారంలో నడుస్తున్న 'పర్సంటేజీ విధానం' వివాదమే ఈ రాజీనామాకు దారితీసిందనే టాక్ వినిపిస్తోంది. మల్టీప్లెక్స్‌ల తరహాలోనే సింగిల్ స్క్రీన్ థియేటర్లలో కూడా టికెట్ల కలెక్షన్లపై పర్సంటేజీ సిస్టమ్ అమలు చేయాలని ఎగ్జిబిటర్లు డిమాండ్ చేస్తుండగా.. పరిశ్రమలోని అగ్ర నిర్మాతలు మాత్రం దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ క్రమంలో సునీల్ నారంగ్ విమర్శలు ఎదుర్కొన్నట్లు తెలుస్తోంది. తీవ్రమైన విభేదాలు, ఒత్తిడి వల్లే రాజీనామా చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

## మహేశ్ బాబు కోడలు జాన్వీ ఫొటోలకు ఫ్యాన్స్ ఫిదా!



టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు మేనకోడలు, నటి దర్శకురాలు మంజుల ఘట్టమనేని కూతురు జాన్వీ స్వరూప్. తాజాగా ఈ యంగ్ బ్యూటీ కారులో దిగిన కొన్ని ఫొటోలను ఆమె తల్లి మంజుల సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ ఫొటోలు క్షణాల్లో నెట్టింట వైరల్‌గా మారాయి. చాలా సింపుల్‌గా, క్యాజువల్ డ్రస్‌లో ఉన్నా కూడా జాన్వీ లుక్స్ మాత్రం అదిరిపోయాయి. ఈ ఫొటో షూట్ చూసిన నెటిజన్లు ఘట్టమనేని మూడో తరం వారసురాలు హీరోయిన్ మెటీరియల్ అంటూ తెగ పొగిడేస్తున్నారు.

**–అక్షరటుడే, సినిమాడెస్క్**